VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ జనవరి 27 సోమవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 191

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## అన్ని గ్రామాల్లో పథకాలు అమలు చేయకపోతే రణరంగమే: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అన్ని గ్రామాల్లో ప్రచారం చేసి గెలిచాక ఇప్పుడు మండలానికో ఊరు చొప్పున పథకాలు అమలు చేయడం ప్రజలను మోసం చేయడమేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వెంటనే అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని లేని పక్షంలో గ్రామాలు రణరంగంగా మారతాయని ఓ ప్రకటనలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. "ఎన్నికల ప్రచారంలో మండలానికి ఒక ఊరిలోనే పథకాలు అమలుచేస్తామని కాంగ్రెస్ చెప్పిందా? గ్యారంటీ కార్డులను కేవలం మండలానికి ఒక ఊరిలోనే పంచిందా? కేవలం మండలానికి ఒక ఊరి ప్రజలే కాంగ్రెస్‌కు ఓటు వేశారా? ఏడాది కాలంగా పథకాలను వాయిదాలు పెట్టి ఇప్పుడు కాంగ్రెస్ ప్రజల్ని మోసం చేస్తోంది. రాష్ట్రంలోని అన్ని గ్రామాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ హామీలను మర్చిపోవద్దు. కాంగ్రెస్ ఆనాడు 'అందరికీ అన్నీ' అని చెప్పిన మాట మరిచి నేడు 'కొందరికే కొన్ని' పేరిట మభ్యపెడుతోంది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మోసాన్ని క్షమించరు. ప్రతిపక్షంగా ఇంకో నాలుగేళ్లు ఓపిక పట్టడానికి మేము సిద్ధం కానీ, ప్రజలు మాత్రం సిద్ధంగా లేరు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రతి గ్రామానికి, ప్రజలకు అండగా ఉంటాం. ప్రభుత్వం వెంటనే అన్ని గ్రామాల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# నూతన పథకాలకు శ్రీకారం

**ప్రజలే 'మా ప్రభుత్వం**

**'మా ప్రభుత్వంలో ప్రజలే రాజులు.. వారికి మేం జవాబుదారీగా ఉంటాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత పాలకుల్లా పాలన చేద్దామంటే కుదరదని, ప్రజల వద్దకే వెళ్లాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించేలా మార్పు తీసుకొచ్చామన్నారు.**

- జనం వద్దకే వస్తున్నాం.. జవాబుదారీగా ఉంటాం
- కొడంగల్‌లో పరిశ్రమల ఏర్పాటును కేసీఆర్ అడ్డుకుంటున్నారు
- 13 నెలలుగా ప్రతిపక్ష నేత అసెంబ్లీకే రాలేదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శలు
- కోస్గి మండలం చంద్రవంచలో నూతన పథకాలకు శ్రీకారం



మహబూబ్‌నగర్: 'మా ప్రభుత్వంలో ప్రజలే రాజులు.. వారికి మేం జవాబుదారీగా ఉంటాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత పాలకుల్లా పాలన చేద్దామంటే కుదరదని, ప్రజల వద్దకే వెళ్లాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించేలా మార్పు తీసుకొచ్చామన్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు.. ముఖ్యమంత్రి కూడా ప్రజల వద్దకే వస్తున్నారని చెప్పారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ఆదివారం ఆయన కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. ఒక్కో పథకానికి ఐదుగురి చొప్పున ఎంపిక చేయగా వారికి సీఎం మంజూరు ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సభలో ఆయన మాట్లాడారు.

రైతులతో పాటు కూలీలకూ అండ

ఇచ్చిన మాట ప్రకారం గత ఆగస్టు 15న రాష్ట్రంలో 22.50 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశాం. మొదటి విడత రైతు భరోసా కింద రూ.7వేల కోట్ల పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో జమ చేశాం. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం వృథాగా మారినా 1.56 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చాం. ఎన్నికల ముందు ములుగు, వరంగల్, నిజామాబాద్ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు భూములున్న వారికే రైతుబంధు ఇస్తున్నారని, పేద కూలీలకు చేయూత అందించాలని భావించాం. అధికారంలోకి వచ్చాక మంత్రులతో చర్చించి భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం

మిగతా 2లో

## ఢిల్లీ కర్తవ్యపథ్‌లో రిపబ్లిక్ డే వేడుకలు.. ప్రత్యేక ఆకర్షణగా ఏపీ శకటం



దేశవ్యాప్తంగా రిపబ్లిక్ డే వేడుకలు జరుగుతున్నాయి. ఇక రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. మరోవైపు.. దేశం మొత్తం జెండా పండుగను జరుపుకుంటున్నారు. ఇక ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌లో దేశంలోని సాంస్కృతిక గొప్పతనాన్ని, సైనిక శక్తిని ప్రదర్శించనున్నారు. ఇందుకు ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీ సహా కీలక ప్రాంతాల్లో పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. భారతదేశం ఇవాళ 76వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటోంది. ఇందుకోసం ముమ్మరంగా దేశవ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు. రిపబ్లిక్ డేలో నిర్వహించే పరేడ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ పరేడ్‌లో దేశంలోని సాంస్కృతిక గొప్పతనం, సైనిక శక్తిని ప్రపంచం మొత్తం ప్రదర్శించనున్నారు. ఈ పరేడ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షత వహిస్తున్నారు.

# "కేంద్ర నిధులివ్వం" అనడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం.

**మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు రాష్ట్రాల హక్కులను హరించడమే.**

**రాజ్యాంగాన్ని కాపాడాలంటున్న రాహుల్ గాంధీ...**

**ముందు తెలంగాణలో రాజ్యాంగాన్ని పరిరక్షించాలి.**

**రాజ్యాంగంపై సెమినార్ లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్ :**

స్వయంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలంగాణలో ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వబోమని ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇది ముమ్మాటికి రాష్ట్రాల హక్కులను హరించడమేనని స్పష్టం చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణపై తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం ఏర్పాటు చేసిన సెమినార్ లో ఎమ్మెల్సీ కవిత కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ, హక్కలను కాపాడడం, పరిపాలనలో పారదర్శకతను పాటించడం, రాజ్యాంగం నిర్దేశించిన ఆదేశిక సూత్రాలు సమర్థవంతంగా అమలు చేయడం వంటి మొత్తం 19 తీర్మానాలను సెమినార్ లో ఆమోదించారు. ఈ తీర్మానాలతో పాటు ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖను త్వరలో విద్యార్థులో రాష్ట్ర గవర్నర్ ను కలిసి అందించనున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి పదవిలో ఉండి మీకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వము అనే మాట మాట్లాడుతున్నారంటే రాజ్యాంగంలో ఉన్న ఫెడరల్ స్ఫూర్తి ఏమైనట్లని ప్రశ్నించారు. బండి సంజయ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రకటించారు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల హక్కులను హరించే అధికారం దానికి లేదని సూచించారు. ఇక పాకెట్ డైరీలా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని దేశమంతా తిరుగుతూ రాజ్యాంగాన్ని కాపాడాలి అని అంటున్నారని, కానీ తెలంగాణలో హననమతువున్న రాజ్యాంగం స్ఫూర్తిపై ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. "రాహుల్ గాంధీని తెలంగాణకు స్వాగతిస్తున్న. మీరు రాష్ట్రంలో అధికారంలో ఉన్నారు. మీరు చెబుతున్న రాజ్యాంగాన్ని ముందు తెలంగాణలో కాపాడండి" అని రాహుల్ గాంధీకి సూచించారు. కొన్ని నెలల క్రితం ఆసిఫాబాద్ లో మతకల్లోహాలు జరిగి వందలాది మంది నిరాశ్రయులయ్యారని, కానీ ఒక్క కాంగ్రెస్ నాయకుడు మాట్లాడలేదని విమర్శించారు.

ఆసిఫాబాద్ లో నెలల తరబడి ఇంటర్నెట్

సేవలు నిలిపివేశారని గుర్తు చేశారు. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి వాళ్లకు ఎలాంటి ఆర్థిక సహాయం గానీ నష్టపరిహారం కానీ అందలేదని ఎండగట్టారు.

" ప్రభుత్వ పెద్దలు కనీసం వాళ్లను పరామర్శించలేదు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు కనీసం అటు వైపు చూడలేదు.. రాజ్యాంగ విలువలని తుంగలో తొక్కుతున్నారు" అని ధ్వజమెత్తారు.



# రాజ్‌భవన్‌లో ఘనంగా 'ఎట్ హోమ్'

**రాజ్‌భవన్‌లో ఘనంగా 'ఎట్ హోమ్' గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్‌భవన్‌లో ఆదివారం రాత్రి 'ఎట్ హోమ్' కార్యక్రమం ఘనంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరు కాగా..**

**గవర్నర్ ప్రతిభా పురస్కారాల ప్రదానం**

**హాజరైన సీఎం రేవంత్, తాత్కాలిక సీజే జస్టిస్ సుజయ్ పాల్, మంత్రులు**

హైదరాబాద్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్‌భవన్‌లో ఆదివారం రాత్రి 'ఎట్ హెూమ్' కార్యక్రమం ఘనంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరు కాగా.. వీరికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు సాదరంగా స్వాగతం పలికారు. అంతకుముందు రాజ్‌భవన్ హాల్‌లో సీఎం రేవంత్, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, కన్హా శాంతివనం వ్యవస్థాపకులు కమలేష్ డి పటేల్ తదితరులతో గవర్నర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం అసెంబ్లీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో 'గవర్నర్ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రత్యేక జీవితకాల సాఫల్య పురస్కారాన్ని డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి, ఐఎఫ్ఎస్ (పర్యావరణ పరిరక్షణ) స్వీకరించారు. వ్యక్తిగత విభాగంలో దుశర్ల సత్యనారాయణ (పర్యావరణ పరిరక్షణ), అరెకపూడి రఘు (వికలాంగుల సంక్షేమం), జీవాంజి దీప్తి (ఆటలు, క్రీడలు), పి.బి.కృష్ణ భారతి (సాంస్కృతిక), ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు (సాంస్కృతిక) అందుకున్నారు. సంస్థాగత విభాగంలో ధ్రువాంశ్ ఆర్గనైజేషన్ (పర్యావరణ పరిరక్షణ), ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (వికలాంగుల సంక్షేమం), ఆదిత్య మెహతా ఫౌండేషన్



(ఆటలు, క్రీడలు), సంస్కృతి ఫౌండేషన్ (సాంస్కృతిక) అందుకున్నారు. అనంతరం పద్మవిభూషణ్ పురస్కారం వరించిన డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి(ఏఐజీ ఛైర్మన్), పద్మశ్రీ మంద కృష్ణమాదిగ (ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు)లను గవర్నర్, సీఎం అభినందించి సత్కరించారు. తర్వాత జాతీయ గీతాలాపనతో తేనేటి విందు కార్యక్రమం ప్రారంభమైంది. సీఎం రేవంత్‌తో కలిసి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు అతిథులందరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్, ఎమ్మెల్సీలు కోదండరాం, అమేర్ అలీఖాన్, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, టీజీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, గవర్నర్ కార్యదర్శి దానకిశోర్, బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు.

వేగుచుక్క

## సంపద, సామరస్యం వైపు తెలంగాణ పయనం



హైదరాబాద్: "కేంద్ర ప్రభుత్వంతో స్నేహపూర్వక, నిర్మాణాత్మక సంబంధాలను కొనసాగిస్తాం. మన రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య స్ఫూర్తికి తెలంగాణ నిజమైన ఉదాహరణ. ప్రజావాణి వంటి కార్యక్రమాలు పౌరులు, ప్రభుత్వం మధ్య ప్రత్యక్ష, పరస్పర సహకారాన్ని, జవాబుదారీతనాన్ని సూచిస్తాయి. సమ్మిళిత పాలన, కొత్త విధానాలు, ప్రజాస్వామ్యం పట్ల అచంచలమైన అంకితభావంతో ప్రభుత్వం ఏడాది కాలాన్ని పూర్తి చేసుకుంది. సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ కోసం పాలన సాగుతోంది. సంపద, సామరస్యం వైపు తెలంగాణ పయనిస్తోంది" అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో ప్రసంగించారు. గవర్నర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జిష్ణుదేవ్ వర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సైనిక, వైమానిక దళాలు, రాష్ట్ర పోలీసులు, కొత్తగా ఏర్పడిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఎన్‌సీసీ క్యాడెట్లు, గురుకుల విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విశేష సేవలందించిన ఉన్నతాధికారులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ సలహాదారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ప్రసంగిస్తూ.. ఈ ఏడాది ప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ గేయం సాంస్కృతిక వైభవాన్ని చాటాయని అన్నారు. తెలంగాణ కళలు, సంస్కృతి, సాహిత్యం, జర్నలిజం రంగాల్లో అపారమైన సేవలందించిన ప్రముఖులను సత్కరించాలని సర్కారు నిర్ణయించిందని చెప్పారు.

అన్నదాతకు అండగా..

"ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం 27 రోజుల్లోనే రాష్ట్రంలోని రైతులకు రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేసింది. రైతు భరోసా పథకం కింద ఎకరాకు అందించే పెట్టుబడి సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచింది. భూమిలేని వ్యవసాయ కూలీలను ఉద్ధరించాలనే లక్ష్యంతో.. ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని ప్రతి రైతు కూలీ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుంది. సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ పేరిట రూ.1,206.44 కోట్లను మంజూరు చేసింది. కృష్ణా వాటర్ ట్రైబ్యునల్-2 ఇటీవల ఇచ్చిన తీర్పు ఫలితంగా.. కృష్ణా జలాల్లో తెలంగాణ తగిన వాటాను పొందడానికి ఆస్కారమేర్పడింది. ఇందుకు ప్రభుత్వ నిరంతర ప్రయత్నాలు దోహదపడ్డాయి.

మహిళా సాధికారత దిశగా..

మహాలక్ష్మి పథకం కింద మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. గృహజ్యోతి పథకం కింద ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందిస్తోంది. పేద కుటుంబాలకు రూ.500కే ఎల్‌పీజీ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తోంది. కోటి మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా, లక్షాధికారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించింది. మహిళా సాధికారత దిశగా అడుగులేస్తోంది.

యువత భవిష్యత్‌కు బాసటగా..

తెలంగాణ యువత ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఆవిష్కరణలకు ఊతమివ్వడం, ప్రపంచ స్థాయి శిక్షణను అందించడానికి వీలుగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద సివిల్స్ పరీక్షలకు హాజరయ్యేవారికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. గత ఏడాది కాలంలో 55,000 మందికి పైగా యువతీ యువకులు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు పొందారు.

ఆరోగ్య రక్ష


ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్య చికిత్సల కవరేజీని రూ.10 లక్షలకు పెంచింది. ఆరోగ్యశ్రీ పరిధిలో మరో 163 కొత్త చికిత్సలను చేర్చింది. ఈ ఏడాది కొత్తగా 8 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించేందుకు అనుమతులు మంజూరు చేసింది. వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, సమాజంలోని ఇతర బలహీన వర్గాలకు వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను కల్పించే ప్రణాళికలో భాగంగా.. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన సర్వే చేపట్టింది. ఇది తెలంగాణ ప్రజల విభిన్న అవసరాలను తీర్చాలన్న మా నిబద్ధతను చాటుతుంది. బలహీన వర్గాల సంక్షేమానికి ఈ ఏడాది రూ.9,200 కోట్లకు పైగా ఖర్చు చేసింది. పోలీసు సిబ్బంది పిల్లల చదువుల కోసం రంగారెడ్డి జిల్లాలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మెట్రో రైలు విస్తరణ, మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను చేపడుతోంది. తెలంగాణలో రూ.1,78,950 కోట్ల పెట్టుబడులకు దావోస్‌లో ఒప్పందాలు కుదిరాయి" అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వివరించారు.



# నూతన పథకాలకు శ్రీకారం

ద్వారా ఏడాదికి రూ.12వేల ఆర్థికసాయం అందించేందుకు నిర్ణయించాం. దీనిద్వారా రాష్ట్రంలో భూమి లేని 10 లక్షల మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుంది. రైతు భరోసా సాయాన్ని రూ.10వేల నుంచి రూ.12వేలకు పెంచాం.. సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

కేసీఆర్, కేటీఆర్‌లకు పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలన్న జ్ఞానం లేకపోయింది రేషన్ కార్డు పేదవారికి ఎంతో కీలకం. పదేళ్ల భారాస పాలనలో కొత్తరేషన్ కార్డులు ఇవ్వలేదు. 80వేల పుస్తకాలు చదివిన మేధావి కేసీఆర్‌కు, అమెరికాలో చదివిన కేటీఆర్‌కు పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలన్న జ్ఞానం లేకపోయింది. రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. వారికి సన్నబియ్యం కూడా పంపిణీ చేస్తాం. దేశంలోనే ఏ రాష్ట్రం చేయని విధంగా మొదటి ఏడాదిలో 55,145 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తుతో పాటు 50 లక్షల పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం. 50 లక్షల కుటుంబాలకు రూ. 500కే గ్యాస్





సిలిండర్ ఇస్తున్నాం. 13 నెలల్లో 120 కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారు. ఆర్టీసీకి రూ.4వేల కోట్లు చెల్లించాం.

కేటీఆర్ కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు కొడంగల్ అభివృద్ధిని మాజీ సీఎం కేసీఆర్, ఆయన మనుషులు అడ్డుకుంటున్నారు. పదేళ్లలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తికాలేదు. కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులు మొదలేపెట్టలేదు. కృష్ణా జలాలను కొడంగల్ ప్రాంతానికి తీసుకురావడానికి ప్రయత్నిస్తుంటే కాళ్లలో కట్టె పెడుతున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు భూసేకరణ చేపడితే అధికారులపై దాడులు చేయించారు. ఈ ప్రాంతం ఎప్పటికీ వెనకబడే ఉండాలా? యువత ఉపాధి లేకుండా తిరగాలా? 13 నెలల్లో ఒక్కరోజు కూడా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రాలేదు. బాధ్యత లేదా? భారాస పాలనలో మీ(కేసీఆర్) ఇంట్లో కుమారుడికి, అల్లుడికి మంత్రి పదవి, ఓడిపోయిన బిడ్డకు ఎమ్మెల్సీ పదవి, తోడల్లుడి కుమారుడికి ఎంపీ పదవి ఇచ్చారు. నేను మా కుటుంబంలో ఎవరికీ పదవులు ఇవ్వలేదు. అయినా మా కుటుంబ సభ్యులు ప్రజలకు సేవ చేస్తుంటే కేటీఆర్ కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు.

కొత్తగా ప్రారంభించిన పథకాలన్నీ లబ్ధిదారులకు మార్చి 31 వరకు అందుతాయి. రూ.22,500 కోట్లతో 4 లక్షల ఇళ్లు కట్టిస్తాం. కొడంగల్ నియోజకవర్గం నుంచి నాలుగు పథకాలను ప్రజలకు అంకితం చేస్తున్నా. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు దావోస్ నుంచి రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం' అని సీఎం రేవంత్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని,

నాలుగు గొప్ప పథకాలను ప్రారంభించిందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21 నుంచి 24 వరకు 12,800 గ్రామసభలు, 3,485 వార్డు సభలను నిర్వహించి అర్హులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో నారాయణపేట, పరిగి ఎమ్మెల్యేలు డా.పర్నికారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ బేన్ షాలన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు విజయ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ వీడియో చూశాకే అర్థమైంది

ప్రస్తుతం తెలంగాణలో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.. తరచూ హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. తన అగ్రెస్సివ్ మాటలతో అధికార పక్షం మీదే కాదు.. తన పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల మీద కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రకరకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే.. ఈసారి కాస్త రూటు మార్చి సైలెంట్‌గా సెటైరికల్ వీడియో వదిలారు. అది కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీదే వీడియో వదలటం గమనార్హం.

తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అధికార ప్రతిపక్షాలు మాటలు గట్టిగానే ఇచ్చి పుచ్చుకుంటున్నాయి. అయితే.. ఈ మధ్య మాంచి ఫైర్ మీదున్న హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.. తరచూ టాక్ ఆఫ్ ది తెలంగాణ అవుతున్నారు. కాగా.. ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ వీడియోతో ప్రజల ముందుకు వచ్చారు. ఈ వీడియోలో పాడి కౌశిక్ రెడ్డి ఫక్తు.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని టార్గెట్ చేశారు. పైకి చాలా అమాయకంగా ముఖం పెట్టి.. గట్టిగానే సెటైర్ వేశారు కౌశిక్ రెడ్డి. ట్విట్టర్ వేదికగా విడుదల చేసిన ఈ వీడియోను.. బీఆర్ఎస్ శ్రేణులు తెగ వైరల్ చేస్తున్నాయి.

"తెలంగాణ ప్రజలందరికీ నమస్కారం. గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు హైదరాబాద్ నడిబొడ్డున ఎంత అద్భుతమైన ఇండ్లు కడుతున్నారో కింద వీడియోలో చూడాలని విజ్ఞప్తి చేస్తున్నా. పొంగులేటి శ్రీనివాస్ గారు.. హైదరాబాద్‌లో ఉన్న పేదలందరూ కూడా ఈ ఇండ్లు ఎప్పుడు వాళ్లకిస్తారని ఎదురుచూస్తున్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు.. మీకు ఇందిరమ్మ మీద ఇంత ప్రేమ ఉందని నాకు ఈ ప్రాజెక్టు చూసిన తర్వాతే అర్థమైంది. ఆ ప్రాజెక్టు పేరు.. ఐరిస్ అని పెట్టారు. ఇందిరమ్మ రెసిడెన్షియల్ ఇంటిగ్రేటెడ్ స్కీమ్ అని పెట్టారు. కన్‌స్ట్రక్టెడ్ బై రాఘవ కన్‌స్ట్రక్షన్స్. మీ అభిమానానికి నిజంగా.. నేను ఆశ్చర్యపోతున్నా. పొంగులేటి శ్రీనివాస్ గారు దయచేసి ఇలాంటి అద్భుతమైన ఐరిస్ బిల్డింగ్‌ని మా హుజురాబాద్‌లో కూడా కట్టి పేదలకు పంచాలని చేతులు జోడించి మరీ విజ్ఞప్తి చేస్తున్నా." అంటూ పాడి కౌశిక్ రెడ్డి చెప్పుకొచ్చారు.

అంతే కాదు.. ఈ వీడియోతో పాటు.. "నిరుపేదలకోసం గొప్ప అవకాశం! ఇండ్లు లేని నిరుపేదలు, ఇందిరమ్మ రెసిడెన్షియల్ ఇంటిగ్రేటెడ్ స్కీమ్ ద్వారా మీ కలలను సాకారం చేసుకోండి. ఈ స్కీమ్ ద్వారా ఇండ్లకు దరఖాస్తు చేసుకోవడానికి వెంటనే చర్యలు ప్రారంభించండి. మీ దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని కలవండి." అంటూ పోస్టులో రాసుకొచ్చారు కూడా. మొత్తానికి.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ "ఐరిస్" పేరుతో నగరంలో.. హౌసింగ్ ప్రాజెక్ట్ నిర్మిస్తుండగా.. దాన్ని పాడి కౌశిక్ రెడ్డి టార్గెట్ చేశారు. ఐరిస్ అనేది ప్రైవేట్ ప్రాజెక్టు అని తెలిసినా.. దాన్ని ఇందిరమ్మ రెసిడెన్షియల్ ఇంటిగ్రేటెడ్ స్కీమ్ అంటూ సెటైరికల్ వీడియో చేసి.. మంత్రి పొంగులేటిని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. కౌశిక్ రెడ్డి గత కొంతకాలంగా తన కోపంతో, మాటలతో వార్తల్లో నిలుస్తూ వస్తున్నారు. అప్పుడు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి



గాంధీతో నువ్వెంత అంటే నువ్వెంతా అని సవాలు విసురుకుని దాడులు చేసుకునే వరకు వెళ్లగా.. ఇటీవల కరీంనగర్ జిల్లా సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో గొడవ పెట్టుకోవటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అటు అసెంబ్లీ సమావేశాల్లో, ఇటు బయటా.. పాడి కౌశిక్ రెడ్డి అగ్రెస్సివ్‌గా ఉంటూ నిత్యం వార్తల్లో నిలుస్తూ వస్తుండగా.. ఇప్పుడు ఈ సెటైరికల్ వీడియోతో సైలెంట్‌గా అధికార పక్షాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు.

## దక్షిణ భాగంపై కీలక అప్డేట్, వేగం పెంచిన సర్కార్

హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు దక్షిణ భాగంపై కీలక అప్డేట్ వచ్చింది. ఉత్తర భాగానికి సమాంతరంగా దక్షిణ భాగం పనులు చేపట్టాలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. అందులో భాగంగా.. వ్యూహాత్మక రోడ్డు మ్యాప్ డీపీఆర్ కోసం కన్సల్టెన్సీ సంస్థ కోసం టెండర్లు పిలిచింది. ఈ టెండర్లకు వచ్చే నెల 14 వరకు అవకాశం కల్పించారు.

తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చేందుకు గాను హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డును ప్రాజెక్టును నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ భాగాలుగా మొత్తం 350 కి.మీ పరిధితో రహదారిని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు దాదాపు 40 కి.మీ దూరంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. ఇప్పటికే 161 కి.మీతో నిర్మిస్తున్న ఉత్తర భాగానికి కేంద్రం టెండర్లు ఆహ్వానించింది. త్వరలోనే టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇక దక్షిణ భాగం పనులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. ఆర్థిక నిర్వహణ, ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్, వ్యూహాత్మక రోడ్డు మ్యాప్ డిజైన్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు సలహాలు, సూచనలు అందించడానికి రేవంత్ సర్కార్ తాజాగా మరో కన్సల్టెన్సీ సంస్థ కోసం టెండర్లను పిలిచింది.

కన్సల్టెన్సీ సంస్థలు బిడ్లను సమర్పించడానికి ఫిబ్రవరి నెల 25న మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం కల్పించారు. ఇందులో రీజినల్ రింగు రోడ్డు దక్షిణభాగం నిర్మాణానికి కావాల్సిన నిధులను ఏ విధంగా సమకూర్చుకోవాలి? ఏ విధంగా ఖర్చు చేయాలి ? తదితర అంశాలతో పాటు సౌత్ పార్ట్ రోడ్డు మ్యాప్, ఇరువైపుల రోడ్డు ఎలైన్‌మెంట్ ఎలా ఉండాలి? భూసేకరణ అంశాలు, వీటి పర్యవేక్షణ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు? వంటి బాధ్యతలను ఎంపికైన కన్సల్టెన్సీ సంస్థకు ప్రభుత్వం అప్పగించనుంది. ఉత్తర భాగం పనులకు సమాంతరంగా దక్షిణ భాగం పనులను కూడా చేపట్టేందుకు సర్కార్ సిద్ధమైంది.

గతేడాది డిసెంబరు 28న ఉత్తరభాగం పనులను చేపట్టడానికి కేంద్రం టెండర్లను ఆహ్వానించింది. ఈ పనులను ఐదు ప్యాకేజీల్లో డిసైడ్ అయ్యారు. నాలుగు వరుసల రహదారితో గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వేగా ఈ రోడ్డును భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అభివృద్ధి చేయనుంది. ఈ టెండర్లకు ఫిబ్రవరి నెల 14 వరకు బిడ్‌లను దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. అదే



నెల 17న బిడ్లను తెరవనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయితే ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం పనులు వెంటనే ప్రారంభమవుతాయి. కేంద్రం చేపట్టే ఉత్తరభాగం పనులకు సమాంతరంగా దక్షిణభాగం పనులను కూడా తామే చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అందులో భాగంగానే తాజాగా కన్సల్టెన్సీ టెండర్లను పిలిచినట్లు తెలుస్తోంది. కాగా, ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సగం తెలంగాణ అభివృద్ధి చెందుతుంది. 60 శాతం వరకు పట్టణీకరణ పూర్తవుతుందని సర్కార్ భావిస్తోంది.

# భార్యను నరికిన కేసు.. 'చైతన్యపురి నర్సు' హత్యే ప్రేరణ..

మీర్‌పేట భార్యను చంపి ముక్కలుగా చేసిన కేసులోరోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తోంది. గతంలో చూసిన ఓటీటీ వెబ్‌సిరీస్‌ల ప్రేరణతో భార్య మృతదేహాన్ని ముక్కలు చేసి సాయంత్రానికి మాయం చేశాడు నిందితుడు గురుమూర్తి. దుర్వాసన రాకుండా అవసరమైన కెమికల్స్ కోసం యూట్యూబ్ వీడియోస్ చూశాడట. దానికి తోడు గత రెండేళ్ల క్రితం హైదరాబాద్ చైతన్యపురిలో జరిగిన నర్సు హత్య ఉదంతాన్ని ప్రేరణగా తీసుకొని దారుణానికి ఒడిగట్టినట్లు తెలిసింది.

మీర్‌పేట భార్యను ముక్కలుగా నరికిన కేసులో రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తోంది. మీర్‌పేట పరిధి న్యూవెంకటేశ్వరనగర్ కాలనీలో ఈనెల 25న భార్య మాధవిని హత్య చేసిన మాజీ ఆర్మీ ఉద్యోగి గురుమూర్తి.. ఆమె శవాన్ని మాయం చేసేందుకు ఇంటర్నెట్‌లో వెతికినట్లు తెలిసింది. ఓటీటీలోని ఓ క్రైమ్ వెబ్‌సిరీస్‌లో శవాన్ని ముక్కలుగా చేయటం చూసినట్లు తెలిసిందే. దాంతో పాటుగా.. రెండేళ్ల క్రితం హైదరాబాద్ చైతన్యపురిలో సంచలనం రేకెత్తించిన నర్సు హత్య ఉదంతాన్ని కూడా ప్రేరణగా తీసుకున్నట్లు తెలిసింది. 2023 మేలో ఇంట్లో అద్దెకు ఉండే నర్సును చంపేసిన ఓనర్.. ఆమె శరీరాన్ని స్టోన్ కట్టర్ల సాయంతో ముక్కలు ముక్కలుగా చేశాడు. ఆ తర్వాత వాటిని ఫ్రిజ్‌లో భద్రపరిచి సమయం దొరికినప్పుడల్లా డిస్పోజ్ చేయాలని అనుకున్నాడు. చుట్టపక్కల వాళ్లకు దుర్వాసన రాకుండా స్ప్రేలు, కర్పూరం, ఇతర కెమికల్స్ వాడి జాగ్రత్త పడ్డాడు.

ఈ కేసులో గురుమూర్తి తన భార్య శవాన్ని ఇదే తరహాలో మాయం చేసినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న హ్యాక్సా బ్లేడుతో ముందు మాధవి తలను వేరుచేసి మొండేన్ని మూడు ముక్కలుగా చేసినట్లు పోలీసుల



విచారణలో తేలింది. ఆ తర్వాత బకెట్‌లో హీటర్ సాయంతో నీటిని వేడి చేసి.. ముక్కల్ని అందులో ఉడికించాడు. తర్వాత మళ్లీ పెద్ద స్టవ్ మీద శరీరా భాగాలను కాల్చాడు. ఈ క్రమంలో ముక్కలు మాంసం ముద్దలుగా మారిపోయాయి. పక్కింట్లో వాళ్లకు దుర్వాసన వెళ్లకుండా కొన్ని కెమెకల్స్ స్ప్రే చేశాడు. మాధవిని చంపిన తర్వాత.. దాదాపు 12 గంటల్లోనూ ఆమె శవాన్ని మాయం చేశాడు. మాంసం ముద్దలను తీసుకెళ్లి చెరువులో వేశాడు. ఆ తర్వాత తనకేం తెలియనట్లు మాధవి తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు చెప్పాడు.

గతంలో ఓసారి గురుమూర్తిపై భార్య తరపు బంధువులు దాడి చేశారు. ప్రకాశం జిల్లా సొంతూరులో మరో మహిళతో వివాహేతర బంధం పెట్టుకోగా..

అది తెలిసి దాడికి పాల్పడ్డారు. ఇప్పుడు భార్యను చంపేశానని తెలిస్తే.. వారు దారుణంగా స్పందిస్తారేమోనని భయపడి ఆమె మృతదేహాన్ని మాయం చేశాడు. ఈమేరకు పోలీసులు విచారణను వేగవంతం చేసి.. ఇతడిచ్చిన సమాచారం మేరకు ఇంట్లో ఆధారాలు సేకరించారు. మాధవి తల వెంట్రుకలు, స్టవ్, వాటర్ బకెట్, హీటర్ వద్ద రక్తం ఆనవాళ్లను గుర్తించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. మిస్సింగ్ కేసును మర్డర్ కేసుగా మార్చి గురుమూర్తిని నిందితుడిగా చేర్చారు.



# కామారెడ్డిలో ఘనంగా గణతంత్ర దినోత్సవం.













**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 26:**

**జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.**

భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పతాకావిష్కరణ గావించినారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్తు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం కలెక్టరేట్ లో జరిగిన వేడుకలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ , ఎస్పీ సింధు శర్మ,లు పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పతాకావిష్కరణ చేశారు. తదుపరి జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ సందేశం. అనంతరం రాజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాన్సువాడ బి.సి.హాస్టల్ విద్యార్థినిలచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు జ్ఞాపికలను కలెక్టర్ అందజేశారు. సి.ఎం.కప్ క్రీడోత్సవాల నిర్వహణ కోసం విరాళాలు అందించిన సఫల ఫార్మా ఇండస్ట్రీస్ ఏం.డి. పైడి ఎల్లారెడ్డి, గాయత్రి షుగర్స్ ఏం.డి. వేంకటేశ్వర రావు లను సత్కరించారు. అనంతరం సి.ఎం. కప్ క్రీడల్లో విజేతలకు బహుమతి ప్రదానం, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణా రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ ఎస్.పి. చైతన్య రెడ్డి, జిల్లా అటవీ అధికారిణి నిఖిత, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, అధికారులు, పలు శాఖల ఉద్యోగులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతి గౌరవాన్ని పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.







**వేగుచుక్క న్యూస్, సిరికొండ, జనవరి 26:**




సత్యశోధక్ పాఠశాలలో ఆదివారం 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య జాతీయ పతాక ఆవిష్కరణ చేసిన అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ విలువలే ప్రమాణాలుగా, మహనీయుల ఆశయాలే లక్ష్యంగా జాతి గౌరవాన్ని పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయలన్నారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి చదువుల పట్ల ఆసక్తిని పెంచుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడవచ్చని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి రాజ్యాంగమే దిక్సూచి.

## - టియు వైస్ ఛాన్సలర్ టి. యాదగిరిరావు.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, జనవరి 26:**



తెలంగాణ విశ్వవిద్యాలయంలో 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆదివారం వైస్ ఛాన్సలర్ పరిపాలనా భవనం ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం విసి మాట్లాడుతూ,ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ఆదర్శ రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ నిర్మాతలకు ధన్యవాదాలు తెలిపారు . కులం మతం ప్రాంత వివక్ష లేకుండా అందరూ ఆత్మగౌరవంతో జీవించేలా రాజ్యాంగం మరింత పటిష్టంగా అమల అయ్యేలా ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. శతాబ్దాలుగా బానిసలుగా జీవించిన భారత పౌరులు స్వేచ్ఛ వాయువులు పీల్చుకొని తమ వ్యక్తిగత జీవితంతో పాటు దేశాభివృద్ధికి పాటుపడేలా రాసిన పవిత్ర గ్రంథం రాజ్యాంగమని కొనియాడారు. రాజ్యాంగము ప్రకారం చట్టం ముందు అందరూ సమానం తో పాటు గా అవకాశాలు అందరికి సమానమని చెబుతుందన్నారు.రాజ్యాంగం కులం మతం వర్ణం వర్గం లింగ విభేదం లేకుండా యావత్ దేశ ప్రజలందరికీ రక్షణగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం యాదగిరి జ్యోతి ప్రజ్వలనచేసి రాజ్యాంగ నిర్మాతల కృషిని, దేశాభివృద్ధికి వారిచ్చిన దార్శనికత్వాన్ని స్మరించినారు.

ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, ఔట్సోర్సింగ్ సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నలంద"లో ఘనంగా గణతంత్రదినోత్సవ వేడుకలు.














**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, జనవరి 26**

పట్టణ పరిధిలోని మామిడిపల్లిలో గల నలంద హై స్కూల్ లో గణతంత్ర దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దీపప్రజ్వలన ప్రిన్సిపాల్ సాగర్ చేయగా, కరస్పాండెన్స్ ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రీస్కూల్, ఓలంపియాడ్ స్కూల్, మరియు హై స్కూల్ విద్యార్థుల యొక్క మార్చ్ ఫాస్ట్ వందనం నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం గొప్పతనం గురించి ప్రిన్సిపాల్ సాగర్ తెలియజేసారు. కరస్పాండెన్స్ ప్రసాద్ విద్యార్థులు ఏలా ఉండాలి, విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ఏ విధంగా ఉండాలి, తల్లిదండ్రులు వారి యొక్క పిల్లలను ఏ విధంగా ఎంకరేజ్ చేయాలి, ఉపాధ్యాయులు విద్యార్థులతో ఎలా ఉండి వారి అభ్యునతికి తోడ్పడాలి అన్న విషయాలను వివరించారు. అనంతరం విద్యార్థులు వారి ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను అలరించారు. ఈ నెలలో నిర్వహించిన ఎఫ్ 3 పరీక్షలలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో సర్టిఫికెట్, మెడల్స్ తో సత్కరించారు .

అనంతరం

రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించిన అటల పోటిలలో గెలుపొందిన వారికీ బహుమతులు అందజేశారు. ఇట్టి కార్యక్రమం లో పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వేగుచుక్క

# ఐఎంఎ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 26:**

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐఎంఎ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డా. అజ్జ శ్రీనివాస్ రావు జాతీయ జెండా ను ఎగరవేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు డా. అజ్జ శ్రీనివాస్, డా. విక్రంరెడ్డి మాట్లాడుతూ, జిల్లా ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగాన్ని



గౌరవీస్తూ, ప్రజలందరూ దేశ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ జిల్లా కొశాదికారి డా. రాజేందర్ సూరినీడు, ఉపాధ్యక్షులు డా. ఏ. శ్రీధర్ రావు, డా. హరీష్ స్వామీ, మాజీ అద్యక్షులు దామోదర్ రావు, సీనియర్ వైద్యులు డా. రామ్మోహన్ రావ్, డా లక్ష్మి నారాయణ, డా సురేంద్ర రెడ్డి, డా. సాంబశివ రావు, డా. వినోద్ కుమార్ గుప్తా, డా. కౌలయ్య, డా జీవన్ రావు, డా. సుభాష్, డా. శివప్రసాద్ తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

# టియు దక్షిణ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ సంబరాలు.





**వేగుచుక్క న్యూస్, బిక్నూర్, జనవరి 26:**

తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో 76 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రిన్సిపల్ డా. సుధాకర్ గౌడ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం గణతంత్ర దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ ప్రాంగణ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యున్నతమైన దేశంగా భారతదేశము ఎదుగుతుందని, దీనికి అతి ముఖ్య కారణం భారతదేశంలోని ఎంతోమంది త్యాగధనుల కృషి,భారత రాజ్యాంగం అని, రాజ్యాంగ రచనలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషిని కొనియాడారు. అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా భారత దేశం విలసిల్లితుందని దానికి రాజ్యాంగం కారణం అన్నారు. స్వేచ్ఛ , సమానత్వం, సామ్యవాదం, సౌభ్రాతృత్వం భారత రాజ్యాంగ ప్రధాన లక్షణాలు అన్నారు. ఈ రోజు రాజ్యాంగం ఫలాలు మనకు అందుతున్నాయంటే అందుకు కారణం డా. బీ.ఆర్. అంబేద్కర్ అని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డా. రాజేశ్వరి మాట్లాడుతూ, నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా విద్యార్థులకు ఆటలు తప్పనిసరి అన్నారు. ఆటల ద్వారా విద్యార్థులకు మానసిక దృఢత్వం, సమస్యలను ఎదుర్కొనే స్థైర్యం అలవడతాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలు విద్యాలయాల్లో భాగం కావాలని అన్నారు. అందుకే దక్షిణ ప్రాంగణం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిం చామని తెలిపారు. అనంతరం క్రీడా పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్స్ డాక్టర్ యాలాద్రి, డాక్టర్ సునీత, డాక్టర్ అంజయ్య, డాక్టర్ నాగరాజు, ఏపీఆర్ఓ డాక్టర్ సరిత, డాక్టర్ నారాయణ గుప్తా, డాక్టర్ రమాదేవి, డాక్టర్ నర్సయ్య, దిలీప్, అధ్యాపక బృందం, మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తి తో ముందుకు సాగాలి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 26:**



భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణంలో ఆదివారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిష్కరణ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది మహనీయుల త్యాగాలతో భారత దేశ స్వతంత్రం సాధించిందని, వారి త్యాగాలతో ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగ అవతరించిందని, రాజ్యాంగ స్ఫూర్తితో దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. గణతంత్ర వారసత్వాన్ని కొనసాగించాలని అన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అతిథిగా జిల్లాకోర్టు ప్రాంగణంలోని పిపి గంగారెడ్డి మెమోరియల్ హాల్ లో బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాజడ్జి సునీత మాట్లాడుతూ, ఆటలు అందరిని ఆలరించాయని అన్నారు. బహుమతులు మరింత క్రీడల పురోగతికి పురికొల్పాలని ఆమె ఆకాంక్షించారు. న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ కు, న్యాయసిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లాజడ్జిలు కనకదుర్గ, శ్రీనివాస్, ఆశాలత, సీనియర్ సివిల్ జడ్జిలు పద్మావతి, శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు ఖుష్బు ఉపాధ్యాయ్, గోపికృష్ణ, చైతన్య, హరి కుమార్, శ్రీనివాసరావు, బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి దొన్నల్ సురేష్, కోశాధికారి దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# "ప్రెస్ క్లబ్"లో ఘనంగా గణతంత్ర వేడుకలు.



**వేగుచుక్క న్యూస్:నిజామాబాద్**

ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొనగా, అధ్యక్షులు రామకృష్ణ జాతీయ జెండాఎగుర వేశారు. అనంతరం రిపబ్లిక్ డే పురస్క రించుకుని నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్.. షటిల్.. క్యారం చెస్ పోటీల్లో రన్నర్స్, విన్నర్స్ తో పాటు జర్నలిస్టులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. బహుమతుల ప్రదానంలో ఐశ్వర్యం హోమ్స్ అండ్ బిల్డర్స్ స్పాన్సర్స్ గా వ్యవహరించారు. ఆ సంస్థ ప్రతినిధి మహంతమ్ మధు చేతుల మీదుగా విజేతలు బహుమతులు అందుకున్నారు. నిత్యం విధి నిర్వహణలో బిజీ గా ఉండే జర్నలిస్టులకు క్రీడా పోటీ లు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని జర్నలిస్టు నాయకులు పేర్కొన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు.














**- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 26**

భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీ ఎఫ్ ఓ వికాస్ మీనా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అధికారులు, పుర ప్రముఖులను కలెక్టర్ కలిసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు బహూకరించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ, అటవీ, డెయిరీ, పశువైద్య, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, నీటి పారుదల, మిషన్ భగీరథ, ఫిషరీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను తిలకించారు. అంతకుముందు ప్రభుత్వం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో పాటు ఇతర సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును చాటుతూ వ్యవసాయం, హౌసింగ్, ట్రాన్స్ కో, ఆర్టీసీ, వైద్యారోగ్య, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రవాణా శాఖ, 108, 102 అంబులెన్స్ లు, సంచార పశు వైద్యశాల తదితర శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందిరమ్మ ఇళ్ల నమూనాతో కూడిన హౌసింగ్ శకటానికి మొదటి బహుమతి దక్కగా, మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్న ఆర్టీసీ శకటం ద్వితీయ, వైద్యారోగ్య శాఖ శకటం తృతీయ బహుమతులను దక్కించుకున్నాయి.

**ఉత్సాహభరితంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు**

రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశభక్తి భావాన్ని నింపుకుని తమ ప్రదర్శనలతో గణతంత్ర దినోత్సవ వేడుకలకు వన్నెలద్దారు. కాకతీయ హైస్కూల్, విశ్వ వికాస్, ఆర్.బీ.వీ.ఆర్.ఆర్, అభ్యాస స్కూల్, విజయ్ హైస్కూల్ తదితర పాఠశాలలకు చెందిన బాలబాలికలు చూడచక్కని నృత్య రీతులను అలవోకగా ప్రదర్శిస్తూ ఔరా అనిపించారు. బాలబాలికలు ఏకరూప దుస్తులు ధరించి తమ అభినయంతో అలరింపజేశారు. ఎదనిండా దేశ భక్తిని నింపుకుని, జాతీయ సమైక్యతా భావం పెంపొందేలా దేశభక్తి గేయాలు ఆలపిస్తూ నృత్య ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా చిన్నారులను కలెక్టర్ తో పాటు ఇతర అతిథులు, జిల్లా ఉన్నతాధికారులు వారి వద్దకు వెళ్లి మెమోంటోలు, ప్రశంసా పత్రాలను బహూకరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో, జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు మువ్వన్నెల జెండా ఆవిష్కరించారు.

**సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో...**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రాజ్యంగ ఫలాలు అందరికీ అందాలి.

**- అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త.**





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 26:**

రాజ్యంగ ఫలాలు అందరికీ అందించేందుకు కృషి చేస్తున్నానని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దన్ పాల్ సూర్య నారాయణ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు నగరంలో వివిధ ప్రాంతాల్లో జాతీయ జెండాను ఎమ్మెల్యే ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనేక మంది మహనీయుల త్యాగాలతో మన దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభించాయని అన్నారు. ప్రపంచంలోనే డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ నేతృత్వంలో రూపొందించిన రాజ్యాంగం ఎంతో గొప్పదని అన్నారు








# మాజీ ఎమ్మెల్సీ, జర్నలిస్టు ఆర్.సత్యనారాయణ మృతి.

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) సంతాపం.**

**వేగుచుక్క న్యూస్:**

సీనియర్ పాత్రికేయుడు, ఉద్యమ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ అకాల మరణం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రగాఢ సంతాపం తెలియజేసింది. జర్నలిస్టుగా పనిచేస్తున్న సమయంలో దశబ్దాల పాటు జర్నలిస్టుల సమస్యలపై మెతుకు సీమ వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమంలో సత్యనారాయణ పోషించిన పాత్ర చిరస్మరణీయమని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్యలు పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో జరిగిన అనేక సామాజిక ఉద్యమాలకు ఆయన అందించిన సహకారం మరచిపోలేనిదని, మెతుకుసీమ ప్రజల కన్నీటి గోసపై వార్త పత్రికల్లో ఆయన రాసిన వరుస కథనాలు నేటికి జిల్లాలో చర్చనీయాంశమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆరేండ్ల ఎమ్మెల్సీ పదవిని, ఆరు నెలల కాలంలోనే త్యాగం చేసిన ఘనత సత్యనారాయణకే దక్కిందని అన్నారు. సత్యనారాయణ మరణం జర్నలిస్టులకు, సామాన్య ప్రజలకు తీరని లోటన్నారు.